సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పీ ప్రావీణ్యా

నాలాల విస్తరణ పనులు పూర్తి చేయాలి

హనుమకొండ, జూలై 12 : వర్షాకాలం దృష్ట్యా నాలాల విస్తరణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నాలాల విస్తరణ పనులు, నయీంనగర్ వంతెన నిర్మాణ పనుల పురోగతి, చెరువు శిఖం ఆక్రమణలు తదితర అంశాలపై గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో పాటు రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సాగునీటి పారుదల, కుడా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలాల విస్తరణ పనుల విషయంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాలాల విస్తరణ, నయీంనగర్ బ్రిడ్జి, ఇతర అభివృద్ధి పనులపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, గ్రేటర్ అధికారులు రాజయ్య, ప్రవీణ్ చంద్ర, శంకర్ లింగం, కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, టౌన్ ప్లానింగ్ సీపీవో వెంకన్న, సాగునీటిపారుదల శాఖ అధికారులు వెంకటేశ్వర్లు, సీతారాం, హర్షవర్ధన్, డీఐవో రామ్మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

మెరుగైన సేవలో ముందుంటాం

మనుమకొండ, జూలై 12: ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రభుత్వ ఉద్యోగులుగా ముందుంటామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు సకాలంలో ప్రజలకు చేరువయ్యేలా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సూచనల మేరకు పనిచేస్తున్నట్లు తెలిపారు. బదిలీల్లో ఉద్యోగులకు నష్టం కలుగకుండా టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్ హుసైనీ చూసుకుంటారన్నారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్, కేంద్ర సంఘం నాయకులు, జిల్లా నేతలు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న పల్లెపాడు దామోదర్

ఫోర్టిఫైడ్ రైస్ అందుబాటులో ఉండాలి

నయీంనగర్, జూలై 12 : ఫోర్టిఫైడ్ రైస్ అందరికీ అందుబాటులో ఉండాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. రాంనగర్‌లోని జిల్లా కార్యాలయంలో వినియోగదారుల చైతన్యసదస్సును శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దామోదర్ హాజరై కరపత్రాలను విడుదల చేసి, మాట్లాడారు. అందరికీ సంపూర్ణ పౌష్టికాహారం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఫోర్టిఫైడ్ రైస్ విధానంపై చాలా వరకు రైస్ మిల్లర్లలో అవగాహన లేదన్నారు. ఆహార కల్తీ నిరోధక శాఖ, పౌరసరఫరాల శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల ఫోర్టిఫైడ్ రైస్ పేరిట నాసిరకం బియ్యం పంపిణీ జరుగుతోందని ఆరోపించారు. సదస్సులో సాంబరాజు చక్రపాణి, అనిల్ కుమార్, ప్రవీణ్, శ్రీనివాస్, గైని రత్నాకర్, రంజిత్, అశోక్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

మెట్టు మురళీధర్‌కు సహృదయ పురస్కారం

హనుమకొండ, జూలై 12 : ఏటా కీ.శే. ఒద్దిరాజు సోదర కవుల స్మారకార్థం అందిస్తున్న సహృదయ సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది మెట్టు మురళీధర్‌కు అందిస్తున్నట్లు సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమరాజు గిరిజామనోహరబాబు, కుందావర్యుల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మురళీధర్ రచించిన 'కనిపించని శత్రువు' నవలకు సహృదయ వార్షికోత్సవం సందర్భంగా ఈ పురస్కారం అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఏవీవీ పాఠశాలకు రూ.5 లక్షల విరాళం

వరంగల్, జూలై 12 : తన తండ్రి రడం మల్లేశం జ్ఞాపకార్థం ఏవీవీ ఉన్నత పాఠశాలలో నూతన తరగతి గది నిర్మాణానికి పూర్వ విద్యార్థి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ లెక్చరర్ రడం శ్రవణ్‌కుమార్ శుక్రవారం రూ.5లక్షల విరాళం కరస్పాండెంట్ చందా విజయకుమార్‌కు అందజేశారు. అనంతరం పాఠశాల పాలక వర్గం శ్రవణ్‌కుమార్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పింగిళి కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రమౌళి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు మదార్, వెంకటేశ్వర్ రావు, చందా శ్రీకాంత్, ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, సంధ్యారాణి, శ్రీనివాస్, సంజీవ, బరుపాటి గోపి, విజయలక్ష్మి, వీరేశలింగం, పిలిఫ్‌లాజరస్, సుధారాణి, భాగ్యలక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు.

19న అరుణాచలగిరికి సూపర్ లగ్జరీ బస్సు

హనుమకొండ చౌరస్తా, జూలై 12 : గురుపౌర్ణమి సందర్భంగా 21న అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం డీ విజయభాను తెలిపారు. ఈ బస్సు 19న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ నుంచి బయలుదేరి 20న ఉదయం 6 గంటలకు ఏపీలోని కాణిపాకం విఘ్నేశ్వరుని దర్శనం, మధ్యాహ్నం ఒంటి గంటకు వెల్లూరులోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం సాయం త్రం 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ తర్వాత 21న మధ్యాహ్నం అరుణాచలం నుంచి బయలుదేరి 22 ఉదయం శ్రీజోగులాంబ శక్తిపీఠం నుంచి హనుమకొండకు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ.4500, పిల్లలకు రూ.2500గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల రిజర్వేషన్ చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9866373825, 7382855492లో సంప్రదించాలని కోరారు.

కేసీఆర్ కృషి వల్లే తెలంగాణలో పచ్చదనం

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

పరకాల : మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సోదా అనిత

కమలాపూర్, జూలై 12 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్లే తెలంగాణలో పచ్చదనం పరుచుకుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం కమలాపూర్ ఎంజేపీ పాఠశాలలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో హరితహారం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రూ.పదివేల కోట్లు ఖర్చు పెట్టి, 273 కోట్ల మొక్కలను 13,657ఎకరాల్లో నాటించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. దేశంలోనే తెలంగాణ పచ్చదనంలో నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. హరితహారం కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం అభినందనీయమన్నారు. మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కమలాపూర్‌లో కేసీఆర్ రూ.40కోట్లతో ఎంజేపీ గురుకులాలను అద్భుతంగా నిర్మించినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలలు నెలకొల్పి, ఒక్కో విద్యార్థిపై రూ.1.25 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. కమలాపూర్‌లో స్టేడియం కోసం నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ బాబు, నాయకులు సత్యనారాయణరావు, ఇంద్రసేనారెడ్డి, తిరుపతిరెడ్డి, అంకతి సాంబయ్య, వెంకటేశ్వర్లు, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

వరంగల్‌చౌరస్తా : మానవ మనుగడకు మొక్కలే మూలాధారమని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కేఎంసీ ఆవరణలో శుక్రవారం ట్రైబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్యారాణి, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేందర్, విశ్రాంత డీఎఫ్‌వో పురుషోత్తం, కేఎంసీ జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అజయ్‌కుమార్, ఐఎంఏ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి అశ్విని, నవదీప్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

పరకాల : సమాజంలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మన మహోత్సవంలో భాగంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటడం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సింహ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు, జూలై 12 : బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త కోరుకొప్పుల సదయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. సదయ్య చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, మాజీ సర్పంచ్ బోళ్ల నరేశ్, బీఆర్ఎస్ నాయకులు రాజు, మెంతుల రాజు, ఎండీ అంకూస్ ఉన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

హనుమకొండ చౌరస్తా, జూలై 12 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగనున్న టూ డే లీగ్ క్రికెట్ పోటీల్లో పాల్గొననున్న జట్టును ఎంపిక చేసినట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపికలు సీకేఎం కాలేజీ మైదానంలో జరిగాయి. జిల్లా సెలెక్షన్స్ కమిటీ తోట రాము, తోట కుమార్, మట్టెడ కుమార్ ఆధ్వర్యంలో ఉత్తమ, బౌలింగ్, బ్యాటింగ్‌లో మెరుగైన ప్రతిభ చూపించిన 15 మంది జట్టుతో పాటు స్టాండ్ బైగా 13 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజా, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్ పాల్గొన్నారు. కాగా, జట్టు కోచ్‌గా గోవిందసింగ్, మేనేజర్‌గా ఆర్ఎల్ ప్రణయ్ కుమార్ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

సెప్టెంబర్ 9లోగా కళా క్షేత్రం పనులు పూర్తిచేయాలి

కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

హనుమకొండ, జూలై 12 : కాళోజీ కళాక్షేత్రం పనులను సెప్టెంబర్ 9లోగా పూర్తి చేయాలని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుడా వైస్ చైర్‌పర్సన్ అశ్వినీతానాజీ వాకడేతో కలిసి కాళోజీ కళాక్షేత్రం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ కళా క్షేత్రం నిర్మాణ పనులపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, సెప్టెంబర్ 9న ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జీ ప్లస్ ఫోర్ మోడల్‌లో నిర్మిస్తున్న క్షేత్రంలో ఒక్కో అంతస్తులో ఒక్కో ప్రత్యేకత ఉంటుందన్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు.

కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్

హనుమకొండ, జూలై 12 : రాష్ట్ర వ్యాప్తంగా సాంకేతిక లోపం కారణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం రిజిస్ట్రేషన్లు ఆగిపోగా, తిరిగి శుక్రవారం ప్రారంభయయ్యాయి. ఆ రోజు వారికి మరుసటి రోజు అవకాశం కల్పించడంతో రెండు రోజులు స్లాట్ బుక్ చేసుకున్న వారు ఒకే సారి వచ్చారు. దీంతో కార్యాలయంలో కిటకిటలాడింది. రోజుకు సగటున 80 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుండగా ఒక శుక్రవారం రెండు వందల వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

నేడు ఎల్బీ లో జెన్‌పాక్ట్ ఇంటర్వ్యూలు

హనుమకొండ చౌరస్తా, జూలై 12 : లాల్‌బహుదూర్ కాలేజీలో ప్లేస్‌మెంట్ సెల్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జెన్‌పాక్ట్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ తెలిపారు. బీటెక్, డిగ్రీ(2018-2024)లో పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, వివరాలకు రాఘవ 93467 67659 నెంబర్‌లో సంప్రదించాలని ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ బీ శృతి, సభ్యులు హెచ్ రాజేశ్వర్‌రావు, కే రాణి, ఎస్ మమత సూచించారు.

ఐనవోలు ఎస్సైగా పీ శ్రీనివాస్

ఐనవోలు, జూలై 12 : ఐనవోలు ఎస్సైగా పస్తం శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్పారు. అనంతరం నూతన ఎస్సైకి పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇక్కడ పనిచేసిన ఎస్సై అనిల్‌కుమార్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన మార్నేని

హనుమకొండ, జూలై 12 : కలెక్టర్ ప్రావీణ్యను రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఆమెను కలిసి పూల మొక్క అందజేశారు.

భద్రకాళీ వేద పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్, జూలై 12 : నగరంలోని భద్రకాళీ దేవస్థానంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 12 ఏళ్లలోపు ఆసక్తి కలిగిన పిల్లలు శనివారం నుంచి 22 వరకు దరఖాస్తులను వేద పాఠశాల కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మాతృభాషలో చదవడం, రాయగలిగి, ఉపనయన సంస్కారం, ఉపాకర్మోత్సర్జనములు పూర్తయిన వారు, సంధ్యావందనం, అగ్నికార్యం, బ్రహ్మయజ్ఞం కంఠస్థం వచ్చిన వారికి మాత్రమే వేద పాఠశాలలో ప్రవేశానికి అర్హులని తెలిపారు.

16న సామాజిక తనిఖీ ప్రజావేదిక

దామెర, జూలై 12 : మండలంలో పాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందాల నివేదికను సమర్పించేందుకు ఈ నెల 16న ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఏపీవో శారద తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగే ఈ ప్రజావేదికకు డీఆర్‌డీవో, సామాజిక తనిఖీ అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. టీఏలు, ఎఫ్ఏలు, డేటా ఆపరేటర్లు, ఈసీలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామెర, జూలై 12 : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నెలవారీ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని దామెర, ల్యాదెళ్ల, వెంకటాపురం, సింగరాజుపల్లి, ఓగులాపురం, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జెన్‌కో ఏఈ పరీక్షకు ప్రత్యేక బస్సులు

హనుమకొండ చౌరస్తా, జూలై 12 : హైదరాబాద్‌లో ఆదివారం జరిగే టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజినీర్ పరీక్షలకు శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ప్రత్యేక బస్సులను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

'డ్రాగన్ ఫ్రూట్ సాగుతో లాభాలు'

దామెర, జూలై 12 : మండలంలోని రైతులు ఎక్కువ లాభాలు ఇచ్చే డ్రాగన్‌ఫ్రూట్ పంటను సాగు చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో శారద సూచించారు. శుక్రవారం సీతారాపురంలో సాగు చేస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ పంటను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈజీఎస్ పథకంలో ఈ పంటకు కావాల్సిన మొక్కలను అందజేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇద్దరు ఆటో దొంగల అరెస్ట్

సుబేదారి, జూలై 12 : ఇద్దరు ఆటో దొంగలను సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సుబేదారి పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ ఉప్పల్ మల్లాపూర్‌కు చెందిన రమేశ్ పట్నాయక్, వేముల సంతోష్ ఇద్దరు కలిసి జల్సాలకు అలవాటు పడ్డారు. డబ్బుల కోసం సుబేదారి పరిధిలో పార్క్ చేసిన మూడు ఆటోలను దొంగతనం చేసి, హంటర్‌రోడ్డు గుట్టల్లోని చెట్ల పొదల్లో దాచిపెట్టారు. ఒక ఆటోను శుక్రవారం విక్రయించడానికి తీసుకువెళ్తుండగా అదాలత్ జంక్షన్ వద్ద తనిఖీల్లో పట్టుబడ్డారు. వారిని విచారించి, చోరికి పాల్పడిన మూడు ఆటోలను స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుడుంబా రవాణా చేస్తున్న ఇద్దరు..

పరకాల, జూలై 12 : అక్రమంగా గుడుంబా రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. మండలంలోని నాగారం గ్రామంలో రూట్ వాచ్ నిర్వహిస్తుండగా చిట్యాల మండలానికి చెందిన అజ్మీరా జుమన్, అర్జీరా రజిత గుడుంబాను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 20 లీటర్ల గుడుంబా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సులోచన, సిబ్బంది లక్ష్మణాచారి, సమ్మయ్య, విజయ్‌కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

ఎల్కతుర్తి, జూలై 12 : మండల కేంద్రంలోని ముల్కనూర్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం కారు, బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వీరనారాయణపూర్‌కు చెందిన నార్లగిరి కొమురయ్య ముల్కనూర్ రోడ్డుకు వెళ్లి ఎల్కతుర్తికి తిరిగి వస్తుండగా, ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో కొమురయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వివరాలు సేకరించి, కారు కోసం అన్వేషిస్తున్నారు.

మహిళ పై లైంగికదాడికి యత్నం

హసన్‌పర్తి, జూలై 12 : మండలంలోని ముచ్చర్లకు చెందిన మట్టెడ రాజ్‌కుమార్(36) గురువారం రాత్రి మద్యం మత్తులో తన పక్కింట్లో ఉంటున్న మహిళపై లైంగికదాడికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేసింది. ఇంతలో భర్త, కుమారుడు రావడంతో రాజ్‌కుమార్ పారిపోయాడు. శుక్రవారం రాత్రి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హసన్‌పర్తి సీఐ సురేశ్ తెలిపారు. కాగా, తనమై మహిళ కుటుంబ సభ్యులు దాడి చేశారని రాజ్‌కుమార్ సైతం ఫిర్యాదు చేశాడు.

బైక్, పందుల కొట్టాలు దహనం

ఎల్కతుర్తి, జూలై 12 : మండలంలోని దండేపల్లిలో కెంసారపు శ్రీనివాస్‌కు చెందిన ద్విచక్ర వాహనంతో పాటు పందుల కొట్టాలను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఇటీవల గ్రామంలో జరిగిన ఓ కేసులో శ్రీనివాస్, అతడి కుటుంబసభ్యులను పోలీసులు రిమాండ్ చేశారు. ఈ క్రమంలో అతడి బైక్‌ను ఇంటి ముందు పెట్టి వెళ్లారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి బైక్‌తో పాటు పందుల కొట్టాలకు నిప్పంటించారు. శుక్రవారం ఉదయం విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఐనవోలు, జూలై 12 : మండలంలోని పంథినికి చెందిన బండి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధితులను శుక్రవారం మాజీ సర్పంచ్ బరిగెల సదానందం పరామర్శించి, రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సొసైటీ డైరెక్టర్ కంకర శ్రీను, బండి కుమారస్వామి, బత్తిని సమ్మయ్య, నర్సింహస్వామి, యాదగిరి, పవన్, రమేశ్, సురేశ్, రమేశ్‌ఉన్నారు.

కేవీలో ముగిసిన పోటీలు

మడికొండ, జూలై 12 : మడికొండలోని కేంద్రీయ విద్యాలయంలో రీజినల్ లెవల్ టీటీ పోటీలు ముగిశాయి. ఇందులో అండర్14 విభాగంలో కేవీ వాల్తేరు బాలురు, బాలికలు మొదటి స్థానంలో, అండర్ 17 విభాగంలో కేవీ వాల్తేరు(బాలికలు), కేవీ తిరుపతి నెం1(బాలురు), అండర్-19 విభాగంలో కేవీ నెం2, ఎస్‌వీఎన్ విశాఖపట్నం(బాలికలు), కేవీ ఒంగోలు(బాలురు) విజేతలుగా నిలిచినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ శ్రీనివాస్ తెలిపారు. పీఎం కేంద్రీయ విద్యాలయం నుంచి అనంతశ్రీ, శ్రీజా, సూర్య, కొదండిరామ్ జాతీయ స్థాయిలో జరిగే టీటీలో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు ఆయన వివరించారు. అనంతరం విజేతలైన క్రీడాకారులకు ప్రిన్సిపాల్ మెడల్స్ అందజేసి అభినందించారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

ముల్కనూర్‌లో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ సబర్బన్, జూలై 12 : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఉద్యోగులు కృషిచేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఎల్కతుర్తి మండలంలోని బావుపేట, దండేపల్లి గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులోని రాగి తీగలను చోరీ చేస్తున్నారని, అలా జరగకుండా నట్టులు, బోల్టులను వెల్డింగ్ చేయించాలని సూచించారు. అనంతరం భీమదేవరపల్లి 132/33 కేవీ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రతి పోలుకు నంబర్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, డీఈ శ్రీధరాచారి, అసిస్టెంట్ ఇంజినీర్లు లక్ష్మణ్ నాయక్, శిరీశ్ పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

హనుమకొండ, జూలై 12 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టి, అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చలో కలెక్టరేట్ పిలుపులో భాగంగా శుక్రవారం సంఘం జిల్లా సెక్రటరీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేయాలని, రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

హనుమకొండ, జూలై 12 : రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేసారు. శుక్రవారం జిల్లా కన్వీనర్ సుజిత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక అవసరాల కిట్లు అందజేత